పాలమూరు బీఆర్ఎస్ 'స్థానిక' ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్ • పుష్కలంగా విజయావకాశాలు

హైదరాబాద్/రంగారెడ్డి, మార్చి 7(నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్ నవీన్ కుమార్ బరిలోకి దిగుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్, ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలతో పలుమార్లు చర్చించి, క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ అనంతరం అధినేత కేసీఆర్ గురువారం ఆయన పేరును ప్రకటించారు. నందిగామ మండలం మామిడిపల్లికి చెందిన నవీన్‌కుమార్ 2006లో మామిడిపల్లి ఉపసర్పంచ్‌గా గెలిచి రాజకీయాల్లో అడుగుపెట్టారు. 2014లో కొత్తూరు జడ్పీడీసీగా, అదే ఏడాది ఉమ్మడి పాలమూరు జడ్పీ వైస్ చైర్మన్‌గా ఆయన పనిచేశారు.

గెలుపు నల్లేరు మీద నడకే

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో కాంగ్రెస్ నుంచి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, ఎంఎస్ఎన్ ఫార్మా డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఏ రకంగా చూసినా బీఆర్ఎస్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి పాలమూరు పరిధిలో 1,445 మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 1,006 మంది బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. వివిధ కారణాలతో ఏర్పడిన ఖాళీల తర్వాత 850 మంది వరకు బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే ఉండడం బీఆర్ఎస్‌కు కలిసి వచ్చే అంశం. ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీపై ఉన్న వ్యతిరేకత సైతం ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూలాంశంగా మారనుంది.

ఖమ్మంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు. చిత్రంలో ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ మధు, జడ్పీ చైర్మన్ కమల్‌రాజు, మేయర్ నీరజ, మాజీ ఎమ్మెల్యేలు వెంకటవీరయ్య, వనమా, నాగేశ్వరరావు, మదన్‌లాల్, వెంకటేశ్వర్లు తదితరులు

ఖమ్మం పార్లమెంట్ 'గులాబీ'దే

- బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామా
- బీసీలకు కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట
- 'కేసీఆర్‌కు కృతజ్ఞత' సభలో పువ్వాడ

ఖమ్మం, మార్చి 7 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఖమ్మం పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన గురువారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో పార్లమెంట్ నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నామా మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు తనను రెండుసార్లు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపారని, మళ్లీ తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఖమ్మం జిల్లాకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, పార్లమెంట్ ఎన్నికల్లో నామాను గెలిపించి కేసీఆర్‌కు కానుక ఇద్దామని కార్యకర్తలకు సూచించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను కష్టాల పాలుచేసిందని విమర్శించారు. అనంతరం.. ఖమ్మం నగరంలోని గాయత్రి మైదానంలో నిర్వహించిన 'కేసీఆర్‌కు కృతజ్ఞత, వద్దిరాజు రవిచంద్రకు అభినందన' సభలో ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, జడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, నేతలు కొండబాల కోటేశ్వరరావు, చంద్రావతి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



పెరిగిన ధరల్తో రోజూ ఉపవాసం లేకుండా, కరెంటు కోతలతో రోజూ జాగారం చేయకుండా చేస్తే ప్రతిశివరాత్రి జాగారం చేసి, ఉపవాసం ఉంటా స్వామీ!

కేసీఆర్‌వి కిట్లు.. రేవంత్‌వి తిట్లు

- సీఎం పౌరుషాన్ని పాలనలో చూపాలి
- రేవంత్‌రెడ్డి కుసంస్కారి.. కేసీఆర్‌ను తిడితే సహించేది లేదు
- బాబు పాపాలు.. కాంగ్రెస్ లోపాలు.. పాలమూరు జిల్లాకు శాపాలు
- పేగులు మెడలో వేసుకొనేది రాక్షసులే
- జీతాలు వేశామన్నారు.. రైతుబంధు ఏది?
- సంగారెడ్డి, నారాయణఖేడ్‌లో సీఎంపై మాజీ మంత్రి హరీశ్ నిప్పులు

సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, క్రాంతికిరణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్

సంగారెడ్డి, మార్చి 7 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రజలకు ఉపయోగపడే కిట్లు తీసుకువస్తే, రేవంత్‌రెడ్డి తిట్లలో పోటీపడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి పదే పదే తన ఎత్తు గురించి మాట్లాడుతున్నారని, తాను కూడా ఆయన ఎత్తు గురించి మాట్లాడగలనని, కానీ రేవంత్‌లా తాను కుసంస్కారంగా మాట్లాడలేనని చెప్పారు. ఎవరెంత ఎత్తు ఉన్నారో ముఖ్యం కాదని, ప్రజల కోసం ఎవరు ఎంత మంచి చేశారన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. గురువారం నారాయణఖేడ్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో, సంగారెడ్డిలో మీడియాతో హరీశ్ మాట్లాడారు. పాలమూరులో కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిట్టాల్సి వస్తే తన గురువు చంద్రబాబును తిట్టాలని, తన పార్టీ కాంగ్రెస్ చేసిన మోసాలను నిందించాలని అన్నారు. చంద్రబాబు పాపాలు, కాంగ్రెస్ లోపాలు, పాలమూరు జిల్లా పాలిట శాపాలు అయ్యాయని తెలిపారు. 2014కు ముందు పాలమూరు జిల్లా పరిస్థితి ఏమిటి? 2024లో పరిస్థితి ఎలా ఉన్నది? అన్న ప్రశ్నకు జవాబిస్తే ఎవరు ఏమిటో అర్థం అవుతుందని అన్నారు. పాలమూరును దత్తత తీసుకున్న చంద్రబాబు అక్కడ ఒక్క ప్రాజెక్టు కట్టలేదని తెలిపారు. పాలమూరు కరువుతో కాంగ్రెస్, టీడీపీ రాజకీయాలు చేశాయని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో ఏపీలోని ప్రాజెక్టులు పూర్తి చేసి, పాలమూరులో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని వెల్లడించారు. పైగా, రాయలసీమకు అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోయారని ఆరోపించారు. నాడు కృష్ణా జలాలు తరలించుకుపోతున్నా రేవంత్‌రెడ్డి ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రేవంత్ తన పౌరుషాన్ని పాలనలో చూపించాలని హితవు చెప్పారు. పేగులు మెడలో వేసుకునేది మనుషులా? రాక్షసులా? అని అన్నారు.

పాలమూరును సస్యశ్యామలం చేసింది కేసీఆరే

కరువు ప్రాంతమైన పాలమూరును ప్రాజెక్టు జలాలతో సస్యశ్యామలం చేసింది కేసీఆర్ అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్, టీడీపీలు పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులకు కేసీఆర్ జీవం చేసి పంటపొలాలకు సాగునీరు అందించారని ఈ సందర్భంగా వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాగితాలకు పరిమితం చేస్తే.. కేసీఆర్ దానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ప్రారంభించారని వివరించారు. నారాయణఖేడ్ రైతులకు సాగునీరు ఇచ్చేందుకు కేసీఆర్ 1,800 కోట్ల రూపాయలతో బసవేశ్వర ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దాని పనులు నిలిపివేసిందని విమర్శించారు. కేసీఆర్‌కు రైతులు ఫస్టు ప్రాధాన్యం అని, రేవంత్‌రెడ్డికి మాత్రం రైతులు లాస్టు ప్రాధాన్యం అని విమర్శించారు. ఉద్యోగులకు ఒకటవ తారీఖున వేతనాలు వేశామని చెప్తున్న రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు డబ్బులు జమ చేయలేదని తెలిపారు. రైతులను కడుపులో పెట్టుకుని కాపాడుకున్న కేసీఆర్ మంచోడా? రైతుబంధు డబ్బులు ఇవ్వని రేవంత్‌రెడ్డి మంచోడా? అన్నది రైతులు ఆలోచించాలని కోరారు. పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం పోరాడేది బీఆర్ఎస్సేనని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ గెలవాలి.. తెలంగాణ నిలవాలి అని పిలుపునిచ్చారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మామిళ్ల రాజేందర్, జైపాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, మఠం భిక్షపతి, గాలి అనిల్‌కుమార్, మాణిక్యం, నరహరిరెడ్డి, కొలనుబాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 2014కు ముందు, 2024లో పాలమూరు పరిస్థితి ఎలా ఉన్నది?
- పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా చేసింది కేసీఆర్
- పాలమూరును పచ్చగా మార్చింది కేసీఆర్
- కేసీఆర్‌కు రైతులు ఫస్టు... రేవంత్‌కు రైతులు లాస్టు
- పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం పోరాడేది బీఆర్ఎస్సే

– మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం మేడ్‌పల్లిలో కాలువ పూడికతీత పనులను రైతులతో కలిసి పరిశీలిస్తున్న మాజీ స్పీకర్ పోచారం

పంటలను ఎండనివ్వం

అన్నదాతకు అండగా ఉంటాం..

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

చందూర్, మార్చి 7: పంటలను ఎట్టిపరిస్థితుల్లో ఎండనివ్వబోమని, రైతన్నలకు అండగా ఉంటామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సాగునీరందించి పంటలను కాపాడుతామని హామీ ఇచ్చారు. గురువారం ఆయన నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం మేడ్‌పల్లి పర్యటించారు. రైతులు సాగుచేస్తున్న పంటలతోపాటు, కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఇటీవల పంటలకు చెరువుల నుంచి అందిస్తున్న కాలువల్లో మట్టిపేరుకుపోవడాన్ని సర్పంచ్ ద్వారా తెలుసుకున్న పోచారం తన సొంత ఖర్చు రూ. 2 లక్షలతో కాలువ పూడికతీత పనులను చేపట్టారు. ఈ మేరకు గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటలకు నీరు అందించే కాలువలో గడ్డి, మట్టి పేరుకుపోయి నీటి ప్రవాహం తగ్గిందని తెలిపారు. మరమ్మతుల కోసం రూ. 2 లక్షలు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. నిధుల విడుదల ఆలస్యమవుతున్న నేపథ్యంలో పంటలు ఎండకుండా ఉండాలనే ఉద్దేశంతో తన సొంతఖర్చుతో మరమ్మతులు చేపట్టినట్టు వివరించారు.

మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- నస్పూర్‌లో కార్యకర్తలతో సమావేశం
- హాజరైన జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, మార్చి 7: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఈ మూడు నెలల పాలనలో ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతను మూటగట్టుకున్నదని అన్నారు. అధినేత కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చారని, పదేండ్లలో ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని గుర్తుచేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని, ప్రజలంతా కేసీఆర్ పాలననే గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడానికి బీజేపీతో కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బాల్క సుమన్ మాట్లాడుతూ.. కక్షసాధింపుతో పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని అన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ సీరియస్‌గా తీసుకుందని, ఈ నెల 13న చెన్నూర్ నియోజకవర్గం, 14న బెల్లంపల్లి నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలతోపాటు సోషల్ మీడియా వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్‌లో రేవంతే ఏక్‌నాథ్ షిండే

మోదీని మొన్న పెద్దన్న అన్నావు మరునాడు కేడీ అంటూ సంబోధనా? బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 7: కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డే మరో ఏక్‌నాథ్ షిండే కావొచ్చని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. గురువారం ఆమె మహబూబ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ అవకాశవాది అని, ఆదిలాబాద్‌లో మొన్న ప్రధాని మోదీ ఎదుటే బడేభాయ్ అన్న రేవంత్.. నిన్న పాలమూరులో మోదీ.. కేడీ అనడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమని అన్నారు. ప్రధానిని కలిసిన అపవాదును తొలిగించుకునేందుకే రాజకీయ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ సభను చేస్తుంటే సంక్రాంతి గంగిరెద్దుల ఆటలు గుర్తొస్తున్నాయని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. దేశంలో 60 ఏండ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏం సాధించిందో చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్‌కు దమ్ముంటే ఆరు గ్యారెంటీలను అమలు చేసి పాలమూరులో ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు.

ఇది మహిళా వ్యతిరేక సర్కారు

- జీవో 3తో ఆడబిడ్డలకు అన్యాయం
- మహిళలపై వివక్షతో ఉద్యోగాలకే గండి
- జీవో రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్త ధర్నా
- ధైర్యముంటే ధర్నాకు అనుమతించాలి
- అనుమతి ఇవ్వకపోయినా ధర్నా చేసి తీరుతాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మహిళా వ్యతిరేక ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత గురువారం మీడియాతో మాట్లాడారు. ఆడబిడ్డలకు తరతరాలపాటు నష్టం జరిగే విధంగా ఈ ప్రభుత్వం జీవో-3ను జారీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం చేసే ఈ జీవోకు వ్యతిరేకంగా భారత జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ధర్నా తలపెట్టామని, కానీ పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. అనుమతి లభించకపోయినా ధర్నా చేసి తీరుతామని ఆమె తేల్చి చెప్పారు. ఆడబిడ్డలకు జీవో-3 వల్ల జరిగే నష్టం గురించి ధర్నాల్లో వివరిస్తామని తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా ధర్నాలు చేసుకోవచ్చని ముఖ్యమంత్రి అన్నారని, ఆ మాట మీద నిలబడితే తమకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎం సృష్టించిన కృత్రిమ కరువు

కరువు వచ్చిందని, ఎవరూ తాగునీళ్లు, సాగునీళ్లు అడగవద్దని ముఖ్యమంత్రి అంటున్నారని, 'ఇది కరువు కాదు, కాళేశ్వరం ప్రాజెక్టును, కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి సృష్టించిన కృత్రిమ కరువు' అని కవిత వ్యాఖ్యానించారు. అనుభవ రాహిత్యం, అవగాహనరాహిత్యంతో ప్రభుత్వం చెరువులను నింపలేకపోయిందని, ఆ నెపాన్ని ప్రకృతి వైపరీత్యంగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు.

అర్వింద్‌ను మళ్లీ ఓడిస్తా

బీజేపీ ఎంపీ అర్వింద్ ఎక్కడ నుంచి పోటీ చేసినా ఓడిస్తానని కవిత శపథం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్లలో అర్వింద్‌ను ఓడించానని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓడిస్తానని, అదే తన ఎజెండా అని స్పష్టం చేశారు. తాను పోటీ చేసే విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని అన్నారు. అలాగే, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రాంతీయ పార్టీలను బొందపెట్టాలని చూస్తున్నారని, అది ఆ పార్టీలతో సాధ్యం కాదని తేల్చిచెప్పారు. తనపై నమోదైన 41 సీఆర్‌పీసీ కేసు వ్యవహారం టీవీ సీరియల్ లాగా సాగుతున్నదని అన్నారు.

రేపే కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ప్రకటించనున్నది. ఈ మేరకు గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆ పార్టీ ఎన్నికల కమిటీ సమావేశమైంది. తొలి జాబితాలో ఎంపిక చేసే అభ్యర్థుల్లో తెలంగాణ సహా ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, లక్షద్వీప్, కేరళ, మేఘాలయ, త్రిపుర, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాలు ఉన్నట్టు సమాచారం. సమావేశంలో 10 రాష్ట్రాల్లోని 60 నియోజకవర్గాల అభ్యర్థులపై ఏకాభిప్రాయం కుదిరినట్టు తెలిసింది. మరో 40 నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేశాక, 100 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసే అవకాశం ఉన్నదని సమాచారం. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్నికల కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హాజరయ్యారు. రాష్ట్రంలోని 10 మంది అభ్యర్థులు దాదాపు ఖరారైనట్టు తెలిసింది. రాత్రి సమావేశం నుంచి బయటకు వచ్చిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అభ్యర్థుల ఎంపిక కసరత్తు కొనసాగుతున్నదని చెప్పారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడించే అధికారం తనకు లేదని తెలిపారు.

పరేషాన్‌లో గురుకుల అభ్యర్థులు

- హడావుడిగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- పీడీ అభ్యర్థుల జాబితాలో అనర్హులు
- రిలిక్విష్‌మెంట్‌పై స్పష్టత కరువు
- ఒక్కరికే రెండు, మూడు ఉద్యోగాలు
- వెరసి మళ్లీ తప్పని బ్యాక్‌లాగ్‌లు
- ఇప్పటికే కోర్టుమెట్లెక్కిన పీడీ అభ్యర్థులు
- అయినా స్పందించని ప్రభుత్వం, ట్రిబ్

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు రాజకీయ ఆకాంక్షలకు ఉపాధ్యాయ ఉద్యోగార్థుల ఆశయాన్ని బలి తీసుకుంటున్నది. హడావుడిగా పోస్టుల భర్తీ చేపట్టింది. కటాఫ్ మార్కుల జాబితాలను ప్రకటించకుండానే, అభ్యర్థులు లేవనెత్తుతున్న అభ్యంతరాలు, డిమాండ్లపై స్పష్టత ఇవ్వకుండానే నియామక పత్రాలు అందించింది. ఇటు సర్కారు, అటు ట్రిబ్ తీరుతో గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు తీరుతో మరోవైపు మళ్లీ భారీగా బ్యాక్‌లాగ్ పోస్టులు ఏర్పడే అవకాశమున్నట్టు తెలుస్తున్నది.

రోజుల వ్యవధిలోనే.. అంతా గోప్యంగా!

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9 క్యాటగిరీల్లో పీజీటీ 1276, టీజీటీ 4020, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2876, టీజీటీ స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 226, మ్యూజిక్ టీచర్ 124 పోస్టుల భర్తీ ప్రక్రియను గత ప్రభుత్వం చేపట్టగా, ట్రిబ్ గత ఆగస్టులోనే రాత పరీక్ష నిర్వహించింది. ఎన్నికల కోడ్, కోర్టు కేసుల నేపథ్యంలో నియామక ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆ సమస్యలు తొలగడంతో ఎంపికైన అభ్యర్థులకు ట్రిబ్ నియామక పత్రాలిచ్చింది.

అయితే డిగ్రీ లెక్చరర్, అటు తరువాత జేఎల్, ఆ తర్వాత పీజీటీ, టీజీటీ పోస్టులను భర్తీ చేస్తామని తొలుత వెల్లడించిన ట్రిబ్.. అందుకు విరుద్ధంగా పోస్టుల భర్తీకి చేపట్టింది. డీఎల్, జేఎల్ పోస్టులను నింపకుండానే తొలుత నేరుగా పీజీటీ, పీడీ, లైబ్రేరియన్, డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టుల భర్తీని చేసేందుకు సిద్ధమైంది. ఇదిలా ఉంటే ట్రిబ్ గత నెల 6న తొలుత పీడీ పోస్టులకు సంబంధించి 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా విడుదల చేసింది. అటు తరువాత 9న లైబ్రేరియన్, అదే 9న పీజీటీ పోస్టుల మెరిట్ జాబితాను ప్రకటించి, ఆ మరుసటి రోజున సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టింది. 20న డీఎల్, 22న జేఎల్, 26న టీజీటీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. డెమోలను, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మొత్తంగా 25 రోజుల్లోనే పూర్తి చేసింది. 24 గంటలు తిరగకముందే ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసి, నియామక పత్రాలను అందజేసింది. క్యాటగిరీల వారీగా కటాఫ్ మార్కుల జాబితాను ట్రిబ్ వెల్లడించలేదు. పూర్తిగా గోప్యతను పాటిస్తున్నది. ఇదేమిటని అడిగితే మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తయిన తరువాత కటాఫ్ మార్కుల ప్రకటిస్తామని ట్రిబ్ ఉన్నతాధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో అభ్యర్థుల్లో అనుమానాలకు తావిస్తున్నది.

ప్రకటించని దివ్యాంగుల కోటా

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని ఉద్యోగాల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లను కల్పించింది. నిబంధనల ప్రకారం దివ్యాంగుల కోటా ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు మరోసారి నిర్వహించాల్సిన వైద్య పరీక్షలను ట్రిబ్ నిర్వహించలేదు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ రోజున దివ్యాంగ అభ్యర్థులకు 2-3 రోజుల్లో ఉస్మానియా వైద్యశాలలో మెడికల్ టెస్ట్ ఉంటుందని ట్రిబ్ అధికారులు వెల్లడించారు. కానీ అవేమీ నిర్వహించకుండానే నేరుగా పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. అదీగాక ఇటీవల డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించినా దివ్యాంగుల కోటాకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను మాత్రం ప్రకటించలేదు.

రిలిక్విష్‌మెంట్‌పై స్పష్టత కరువు

వాస్తవంగా రిలిక్విష్మెంట్‌ను గతంలోనే తొలగించారు. అంటే గురుకులాల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు మూడేండ్ల వరకు ఉద్యోగాన్ని వదిలిపోబోమని, ఒకవేళ వదిలేస్తే రూ.లక్ష జరిమానా చెల్లిస్తామని, ఆ ఉద్యోగాన్ని మెరిట్ జాబితాలో ఉన్న తదుపరి అభ్యర్థికి ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఒప్పంద పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. రిలిక్విష్మెంట్ ప్ర